స్థానిక సమరానికి సిద్ధం కావాలి

- కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు
- మహాముత్తారంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం

బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మహాముత్తారం, జనవరి 29 : స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు సిద్ధంగా ఉండాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పలువురు మృతుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పుట్ట మధు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను తుంగలో తొక్కిందని, ఆరు గ్యారెంటీలతో ప్రజలను నిలువునా ముంచిందని విమర్శించారు. ఏ వర్గం కూడా ఆనందంగా లేరన్నారు. బోగస్ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. నాలుగు కొత్త పథకాలు రిపబ్లిక్ డే 26న ప్రారంభిస్తున్నామని, మండలానికి ఒక గ్రామాన్ని పైలట్‌గా ఎంచుకున్నారని తెలిపారు. గ్రామ సభ ఏర్పాటు చేసి నాలుగు పథకాలకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలు ఇద్దరికి చేతిలో పెట్టి చేతులు దులుపుకున్నారని తెలిపారు. రైతు భరోసా నిధులు పైలట్ గ్రామానికి వేస్తారా? మిగతా గ్రామాల్లోని వారు రైతులు కాదా? నాట్లప్పుడు గుర్తుకురానిది ఓట్లప్పుడు ఎలా రైతుబంధు గుర్తుకొచ్చిందని దుయ్యబట్టారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టేందుకు గ్రామాల్లో, పట్టణంలో ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలంతా ఐక్యంగా ముందుకెళ్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన ముఖ్యనాయకులకు సలహాలు సూచనలు చేశారు.

పలు కుటుంబాలకు పరామర్శ

మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టమధు బుధవారం పరామర్శించారు. కనుకునూర్‌లో పులిసే మమత, అమలి మౌనిక, రెడ్డిపల్లి గ్రామంలో అజ్మీరా హిమ్ము, అజ్మీరా రాంజీ, జరుపుల రాజేందర్ ఇటీవల మృతిచెందారు. వారి చిత్రపటాలకు పుట్ట మధు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతుబీమా పథకం ద్వారా తమకు రూ.5లక్షలు వచ్చాయని, ఈ పథకం పెట్టిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు హిమ్ము కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. జక్కు రాకేశ్, మాజీ జడ్పీటీసీ మందాల రాజిరెడ్డి, అనిల్‌రెడ్డి, మండల అధికార ప్రతినిధి బోడ బాలాజీనాయక్, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు గాంధీ విగ్రహాలకు బీఆర్ఎస్ వినతులు

ఏటూరునాగారం, జనవరి 29 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైనందున గురువారం అన్ని మండలాల్లో గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పార్టీ మండల, గ్రామశాఖల అధ్యక్షులు, అనుబంధ సంఘా లు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. 420 హామీలు నెరవేర్చకపోవడంపై నిరసన తెలుపుతూ వినతిపత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ అంతరాయం

ములుగు రూరల్, జనవరి 29 : విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా జిల్లా కేంద్రంలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ ఏఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఫైర్‌స్టేషన్, కృష్ణకాలనీ, బంగారుపల్లి రోడ్డు, డీఎంహెచ్‌వో కార్యాలయం, వెటర్నరీ వైద్యశాల, ఎస్పీ కార్యాలయం, అరవింద పాఠశాల ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ ఉండదని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముదిరాజ్‌లు ఐక్యంగా పోరాడాలి

రేగొండ, జనవరి 29 : ముదిరాజ్ కుల స్తులు హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ అన్నారు. వరంగల్‌లో ఫిబ్రవరి 2న జరిగే ముదిరాజ్ మహాసభ పోస్టర్ మండల కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. ముదిరాజ్ మండలశాఖ అధ్యక్షుడు మారబోయిన ధనుంజయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అశోక్ పాల్గొని మాట్లాడారు. వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు రజినీకాంత్, నాయకులు రాజు, సురేశ్, సంతోష్, బొజ్జం ప్రవీణ్, సాదు నాగేశ్ ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 2.5 కోట్లు మంజూరు

ఏటూరునాగారం, జనవరి 29 : మండల కేంద్రంలోని ముక్కెర లాలయ్య ఇంటి నుంచి పానం సాంబశివరావు ఇంటివరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.2.5కోట్లు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎర్రబెల్లి మనోజ్ తెలిపారు. సీసీ రోడ్డుతోపాటు డ్రెయినేజీ కూడా మంజూరైందని పేర్కొన్నారు.

బాలికల హాస్టల్ తనిఖీ చేసిన డీఎస్‌డీవో

ఏటూరునాగారం, జనవరి 29 : మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను డీఎస్‌డీవో లక్ష్మణ్‌నాయక్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కామన్ మెనూ అమలుపై ఆరా తీశారు. హాస్టల్‌లో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, సిబ్బందిని ఆదేశించారు.

టాటా ఏస్, బైక్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

రేగొండ, జనవరి 29 : మండలంలోని రంగయ్యపల్లిలో టాటా ఏస్, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో మండలంలోని గడిపల్లికి చెందిన పత్తి కృష్ణారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలు.. పత్తి కృష్ణారెడ్డి పని నిమిత్తం ద్విచక్రవాహనంపై బుధవారం మధ్యాహ్నం మండల కేంద్రానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చిట్యాల రోడ్డు నుంచి ఎదురుగా వచ్చిన టాటా ఏస్ ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. పెట్రోలింగ్ పోలీస్ కానిస్టేబుళ్లు సీహెచ్ సురేశ్, ప్రవీణ్ గమనించి 108 సాయంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి బైక్ బోల్తా.. ఒకరికి తీవ్ర, మరొకరికి స్వల్పగాయాలు

మహదేవపూర్: బైక్ అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఒకరికి తీవ్రంగా, మరొకరికి స్వల్పగాయాలైన ఘటన మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం గ్రామానికి చెందిన సమ్మయ్య (61) తన కుమారుడు రవితో కలిసి మహదేవపూర్ మండలంలోని ఓ గ్రామానికి పనినిమిత్తం బైక్‌పై వచ్చాడు. పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయ సమీపంలోని బైక్ అదుపుతప్పి బోల్తాకొట్టింది. దీంతో సమ్మయ్య తలకు తీవ్రగాయాలు కాగా రవికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సమ్మయ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు.

కౌన్సిలర్‌కు వార్డు ప్రజల సన్మానం

కౌన్సిలర్ రజిత, జుమ్ములాల్‌ను సన్మానిస్తున్న వార్డు ప్రజలు

కృష్ణకాలనీ, జనవరి 29 : భూపాలపల్లి మున్సిపాలిటీ 11వ వార్డు పెద్దకుంటపల్లిలో పదవీ విరమణ పొందిన కౌన్సిలర్ బానోత్ రజితా జుమ్ములాల్‌ను బుధవారం స్థానికులు బొకేలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో కొడారి రాజేందర్, గుండవేని రమేశ్, సనా సుధాకర్, రాకేశ్, కొమురవెల్లి జగన్, సదానందం పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి

భూపాలపల్లి రూరల్, జనవరి 29 : ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని జిల్లా రవాణాశాఖ అధికారి సంధాని సూచించారు. బుధవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని కేటీకే-5 ఇంక్లైన్ గనిలో అధికారులు, సింగరేణి కార్మికులకు రోడ్డుభద్రత నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ ఎండీ అబ్దుల్ అసిఫ్‌పాషా, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి రాంచందర్, సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

హత్య కేసులో భార్య అరెస్ట్

భూపాలపల్లి రూరల్, జనవరి 29 : భర్తను హత్య చేసిన కేసులో భార్యను పోలీసులు అరెస్ట్ చేశారు. భూపాలపల్లి సీఐ నరేశ్ కుమార్ బుధవారం వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి పట్టణంలోని కాసీంపల్లికి చెందిన కందుల సురేశ్(37) సోమవారం అనుమానాస్పదంగా మృతిచెందినట్లు తల్లి కందుల సుగుణ ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. బుధవారం మృతుడి భార్య కందుల స్వప్న పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయిందని, భర్త సురేశ్‌ను తన అక్రమ సంబంధానికి అడ్డువస్తున్నాడని జనవరి 26వ తేదీ రాత్రి ఆహారంలో విష పదార్థం కలిపి ఇచ్చినట్లు తెలిపింది. ఆ తర్వాత ముఖంపై బొంతతో అదిమి హత్య చేసినట్లు అంగీకరించింది. ఆమెను జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

పాత పద్ధతిలోనే ఆర్టీసీ బస్సు నడపాలి

ములుగు రూరల్, జనవరి 29 : మండలంలోని అంకన్నగూడెం బస్ సర్వీస్‌ను పాత పద్ధతిలోనే హనుమకొండకు నడపాలని సీపీఎం ఆధ్వర్యంలో రాయినిగూడెంలో ధర్నా చేపట్టారు. సీపీఎం నాయకుడు గుండెబోయిన రవి మాట్లాడుతూ 35 ఏళ్లుగా వరంగల్-2డిపో నుంచి అంకన్నగూడెంకు నైట్‌హాల్ట్ బస్సు సర్వీసు నడుపుతున్నారని, దీన్ని పరకాల డిపోకు మార్చడంతో ఏడు గ్రామపంచాయతీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి

సమన్వయ కమిటీలతో బడే నాగజ్యోతి

తాడ్వాయి, జనవరి 29 : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. మండలంలోని కొత్తూరులో ఊరట్టం ఎంపీటీసీ పరిధితోపాటు మండలంలోని పార్టీ గ్రామశాఖలు, సీనియర్ నాయకులతో ఆమె బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎంపీటీసీ పరిధి సమన్వయ కమిటీని, ఊరట్టం, మేడారం, కల్వపల్లి గ్రామ పంచాయతీ సమన్వయ కమిటీలను ఎన్నుకున్నారు. ఆమె మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యకర్తలు అందరూ సమన్వయంతో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని అన్నారు.

పరామర్శ

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సత్తు భద్రయ్య ఇటీవల గుండె సమస్యతో చికిత్స పొందగా ఆయనను బుధవారం జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పరామర్శించారు. గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు కొండా సురేశ్ తల్లి సరోజనను సైతం పరామర్శించారు. మండల అధ్యక్షుడు లకావత్ నరసింహానాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నామ్ పూర్ణచందర్, చల్వాయి మాజీ సర్పంచ్ ఈసం సమ్మయ్య, బొల్లం ప్రసాద్, భూరెడ్డి మధు, తాడ్వాయి మాజీ జడ్పీటీసీ రామసాయం శ్రీనివాస్, రేండ్ల శ్రీనివాస్, చుక్క గట్టయ్య, ఓదేలు, కృష్ణారెడ్డి, రాందెడ్డి, రమేశ్, రఘు, కనకయ్య, కుమార్, రమేశ్, రంజిత్, కృష్ణ, రాజు, రమేశ్, సమ్మయ్య, మహేశ్, స్వరూప, విజయ ఉన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణ పనుల పరిశీలన

జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కృష్ణకాలనీ, జనవరి 29 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనాన్ని బుధవారం కలెక్టర్ రాహుల్‌శర్మ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ భవన నిర్మాణంలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రంథాలయ భవనానికి విద్యుత్ కనెక్షన్ కోసం సింగరేణి అధికారులతో చర్చించి త్వరలోనే అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పుస్తకాలు పెట్టే ఫర్నిచర్, పుస్తక విభాగం, పత్రికల విభాగాలకు వేర్వేరు పార్టిషన్లు ఏర్పాటు చేయాలన్నారు.ప్రాంగణంలో ఉన్న సెల్ టవర్ పక్క నుంచి ప్రధాన గేటు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గ్రంథాలయ కార్యదర్శి శ్రీలత, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఈ మహేందర్, గిర్దావర్ రామస్వామి, గ్రంథాలయ సిబ్బంది చంద్రమౌళి, రవీందర్, మంజుల పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

గణపురం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ రాహుల్‌శర్మ విద్యార్థులకు సూచించారు. బుధవారం గణపురం కేజీబీవీని ఆయన తనిఖీ చేశారు. వంటగదిని, వంట సామగ్రిని, వండిన పదార్థాలను పరిశీలించారు. సరుకుల వివరాలను ఎస్‌వో లావణ్యను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను ఎస్‌వో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కుందూరుపల్లి ఎంపీపీఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. డీఈవో రాజేందర్, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో భాస్కర్, గిర్దావర్ దేవేందర్, పంచాయతీ కార్యదర్శి విజేందర్ పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న కాటారం ఉద్యోగులు

పెండింగ్ జీతాలు ఇవ్వాలని వినతి

కాటారం/ మల్హర్/ వెంకటాపూర్/ వాజేడు/ ఏటూరునాగారం, జనవరి 29: మూడు నెలలుగా జీతాలు రాక, నిత్యావసర సరుకులు కొనుక్కోలేక కుటుంబం గడవడమే కష్టతరంగా ఉందని, వెంటనే జీతాలు ఇప్పించాలని కాటారం, మల్హర్, వెంకటాపూర్, వాజేడు, ఏటూరునాగారం మండలాల ఉపాధి హామీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కాటారం, తాడిచెర్ల, వెంకటాపూర్, వాజేడు, ఏటూరునాగారం మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవోలు బాబు, శ్యాంసుందర్, రాజు, విజయ, రాజ్యలక్ష్మికి పెండింగ్ జీతాలు ఇప్పించాలని ఈజీఎస్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవోలు వెంకన్న, హరీశ్, వాజేడులో ఈజీఎస్ ఏపీవో మాలోత్ రాజు, ఈసీ సత్యేంద్రకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు చిట్టెం గాంధీ, గొంది గౌరిబాబు, రాంబాబు, వాసం ఆదినారాయణ, కంప్యూటర్ ఆపరేటర్ పీర్ల స్వప్న, ఏటూరునాగారంలో ఏపీవో చరణ్‌రాజు, ఈసీ మాల్యాద్రి, టీఏ అనిత, సీవో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్తను హత్యచేసిన కేసులో జీవితఖైదు

- రూ.10వేల జరిమానా విధించిన జడ్జి నారాయణబాబు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కిరణ్‌ఖరే

అల్లే ప్రభాకర్ (ఫైల్)

భూపాలపల్లి రూరల్/రేగొండ, జనవరి 29 : అనుమానంతో భార్యపై గొడ్డలితో దాడికి పాల్పడే క్రమంలో అడ్డొచ్చిన అత్తను చంపిన కేసులో మండలంలోని చెన్నాపురం గ్రామానికి చెందిన అల్లె ప్రభాకర్‌కు భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు జీవిత ఖైదుతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ కిరణ్‌ఖరే తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం వివరాల్లోకి వెళ్తే.. అల్లె ప్రభాకర్‌కు ఇదే గ్రామానికి చెందిన ఒన్నాల సుజాతతో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు. భార్యను ప్రభాకర్ అనుమానిస్తూ నిత్యం మద్యం తాగి గొడవపడి చితికబాదేవాడు. ఈ విషయమై పలుమార్లు గ్రామంలో పంచాయితీలు నిర్వహించారు. 2019లో భార్యను చితకబాదగా ఆమె పిల్లలతోపాటు తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో ప్రభాకర్ పుల్‌గా మద్యం తాగి 2019 మే 14న అర్ధరాత్రి అత్తగారింటికి వెళ్లి నిద్రిస్తున్న అత్త ఒన్నాల లక్ష్మి(65)పై గొడ్డలితో దాడి చేయగా అక్కడికక్కడే చనిపోయింది. దాడిలో భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. పిల్లలు అరవడంతో చుట్టుపక్కల వారు రాగా ప్రభాకర్ పారిపోయాడు. మృతురాలి కుమారుడు మల్లయ్య ఫిర్యాదు మేరకు నాటి ఎస్సై సదాకర్ కేసు నమోదు చేయగా సీఐ శ్రీనివాస్ నిందితుడిని అరెస్టు చేశారు. అప్పటి సీఐ సాయిరమణ కోర్టులో చార్జి షీట్ వేయగా కేసు విచారణలో ప్రభాకర్ నేరం చేసినట్లు రుజువైంది. దీంతో జిల్లా న్యాయమూర్తి నారాయణబాబు ప్రభాకర్‌కు జీవితఖైదుతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎదులాపురం శ్రీనివాస్ వాదనలు వినిపించగా కోర్టు లైజనింగ్ ఆఫీసర్ జీ వెంకన్న ఆధ్వర్యంలో పీసీ జ్యోతి సాక్షులను ప్రవేశపెట్టారు.

మాట్లాడుతున్న టీఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య

విజిలెన్స్ పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలి

భూపాలపల్లి రూరల్, జనవరి 29 : సింగరేణి కారుణ్య నియామకంలో డిపెండెన్స్ ఉద్యోగ బాధితుల మారు పేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య డిమాండ్ చేశారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీఎస్‌యూఎస్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య మాట్లాడుతూ అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి పలు హామీలు ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఎస్‌యూఎస్ నాయకులు దాసరి జనార్దన్, కాసర్ల ప్రసాద్‌రెడ్డి, నామాల శ్రీనివాస్, రాళ్ల బండి బాబు, శ్రీధర్, కే నరసింహారెడ్డి, ఎండీ సలీం పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు తాత్కాలిక అంతరాయం

కాటారం, జనవరి 29 : ప్రస్తుతం మండలంలోని మిల్లుల వద్ద పత్తి నిల్వలు పేరుకుపోయిన కారణంగా రైతుల వద్ద నుంచి తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు కాటారం మార్కెట్ కార్యదర్శి షరీఫ్ తెలిపారు. మిల్లుల వద్ద పత్తి పూర్తిగా జిన్నింగ్ అయ్యేంత వరకు పత్తి కొనుగోళ్లు ఆపాలని సీసీఐ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఫిబ్రవరి 3నుంచి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రైతులు గమనించి పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకురావద్దనీ, తిరిగి కొనుగోళ్లు పునరుద్ధరించే తేదీని ప్రకటించేంత వరకు సహకరించాలని కోరారు.

టీయూఎఫ్ విద్యా విభాగం జిల్లా కన్వీనర్‌గా సతీశ్

కొట్టె సతీష్

కాటారం, జనవరి 29 : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) విద్యా విభాగం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్వీనర్‌గా మండలకేంద్రానికి చెందిన కొట్టె సతీశ్ నియామకమయ్యారు. కొట్టె సతీశ్ లండన్‌తోపాటు తెలంగాణలోని వివిధ యూనివర్సిటీల్లో ఉన్నత చదువులు అభ్యసించి స్వయం కృషి స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిరుపేద విద్యార్థులకు చేయూత ఇవ్వడం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, ఇతర సమాజహిత కార్యక్రమాలు చేపట్టడం వంటి కార్యక్రమాలను గుర్తించి టీయూఎఫ్ చైర్మన్ చీమ శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్ విశ్వనాథన్ ఈ నియామకం చేపట్టారు.

కాళేశ్వరానికి పోటెత్తిన భక్తులు

త్రివేణి సంగమంలో మహిళల పుణ్యస్నానాలు

మహదేవపూర్(కాళేశ్వరం), జనవరి 29 : మండలంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర ఆలయ క్షేత్రానికి బుధవారం మౌని అమావాస్య నేపథ్యంలో భక్తులు పోటెత్తారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పవిత్ర గోదావరి నది త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాల తర్వాత గోదావరి మాతకు మొక్కారు. ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

సరస్వతీ పుష్కరాల పనుల పరిశీలన

కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాల పనులను బుధవారం అధికారులు పరిశీలించారు. ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో కాళేశ్వరక్షేత్రంలో మహా కుంభాభిషేకం, మే 15 నుంచి 26వరకు సరస్వతీ పుష్కరాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పనులు చేపడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ఆలయ అభివృద్ధికి రూ.25కోట్ల నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. వివిధ పనులు పూర్తి చేయగా మిగిలిన రూ.50లక్షలతో ఆలయ రాజగోపురం ముందు వద్ద పాత సీసీ రోడ్డు తొలగించి నూతన మెట్ల మార్గం పనులు చేపడుతున్నారు. ఈ పనులను బుధవారం పంచాయతీరాజ్ డీఈఈ సాయి, ఏఈ రవీందర్ పరిశీలించారు. వీఐపీ ఘాట్ త్రివేణి సంగమం వద్ద రూ.కోటి నిధులతో సుమారు 20ఫీట్ల సరస్వతి అమ్మవారి రాతి విగ్రహ తయారీ పనులు చేపట్టగా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

ఆర్టిజన్ నాగరాజు కుటుంబాన్ని ఆదుకుంటాం

నివాళులు అర్పిస్తున్న కేటీపీపీ సీఈ శ్రీప్రకాశ్

గణపురం, జనవరి 29 : కేటీపీపీలో ఆర్టిజన్ కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతిచెందిన మానేటి నాగరాజు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని కేటీపీపీ సీఈ శ్రీప్రకాశ్ అన్నారు. బుధవారం కేటీపీపీ సర్వీస్ బిల్డింగ్‌లో ఆర్టిజన్ కార్మికులు నాగరాజు సంతాపసభ నిర్వహించారు. చీఫ్ ఇంజినీర్ శ్రీప్రకాశ్ హాజరై నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగరాజు మృతి బాధాకరమన్నారు. ఎస్ఈలు, డీఈలు, ఇంజినీర్ అసోసియేషన్ నాయకులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, ఓఅండ్ఎం, ఆర్టిజన్ కార్మికులు, ఆర్టిజన్ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

'చిన్న కాళేశ్వరం' కెనాల్ పనులు పరిశీలించిన అదనపు కలెక్టర్

అధికారులతో చర్చిస్తున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

మహదేవపూర్, జనవరి 29 : చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మండలంలోని బ్రాహ్మణపల్లిలో చేపట్టిన డిస్ట్రిబ్యూటరీ కెనాల్ -1 పనులను అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ బుధవారం పరిశీలించారు. పలు సాంకేతిక అంశాలపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో చర్చించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్, ఇరిగేషన్‌శాఖ అధికారులు, సర్వేయర్ రాజారమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

చిట్యాల(టేకుమట్ల), జనవరి 29 : మానేరు వాగులో మట్టి రోడ్డు పోసి వాహనదారుల దగ్గర పైసలు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలనీ సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేశ్, బహుజన సమాజ్ పార్టీ